# ఆదర్శ ప్రపంచము

శ్రీమతి వెలివండ చూడికుడుత్తమ్మగారు

అది జ్యేష్ఠమాసము మండువేసంగి. సూర్యభగవానుడు తన ప్రచండతేజోమహిమనంతా, కడుపుకోసరం వీధులవెంబడి తిరిగే కాటకజనానికి చూపిస్తున్నాడు. సంపన్నులైన మహనీయులంతా, తమతమ సౌధరాజాల్లో పైన యెలక్ట్రిక్ ఫానులు విసురుతూ ఉంటే, ఆపసోపాలుపడుతూ నిద్రపోబోతున్నారు. తెల్లవారుఝామున మూడుగంటలకేలేచి అణానో, బేడో, పెట్టి ఏఆకుకూరలో, ఏనీళ్లపెరుగో కొనుక్కొని దానివల్లవచ్చే లాభంతో ఆపూట బ్రతుకుదామనుకొని, కొన్నిమైళ్లదూరంలో ఉన్న పట్నాల్లోకివచ్చి ఇంట్లోనుండి వీధిలోకి అడుగుపెడితే తమ అడుగు కందిపోతుందనుకునే ధనవంతురాండ్ర పంచలంబడి దిమ్మతిరిగి, వారిచ్చే ఏగాణినూకలో, ఏపిచ్చిసోలెడు గింజలో గంపలోపోసికొని, పైనుండి మాడ్చే ఎండవేడికి, లోపట్నించి కాల్చేఆకలివేడికి తాళుకోలేక గభాగభా పరుగెడుతున్నారు పల్లెటూరిజనం తమతమ పల్లెలకింకా. అంతకంటె నిర్భాగ్యులైన కొంతమంది, ఆమాత్రం అమ్ముడుబోనందున ఇంకా ఆ ఎండలో, "పెరుగో, కూరో" అని సత్తువచచ్చిన కంఠస్వరంతో వీధువెంబడి కేకలేస్తున్నారు. బిచ్చగాళ్లు లెక్కలేకుండానే ఎక్కడచూచిన ప్రతిగుమ్మం వెంబడి వ్రేలాడుతూనే ఉన్నారు. ప్రేమానందరావు ఇంకా భోజనంలేకుండానే ఏదో ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాడు. లోపట్నించి అతనితల్లి భోజనానికి లెమ్మని రెండుమూడుసారులువచ్చి పిల్చిందిగాని పరధ్యాన్నంగా ఉండటంచూచి తిరిగి లోనికి వెళ్లిపోయింది. అతడు తనచేతిలో దాదాభాయిగారు వ్రాసిన "హిందూదేశదారిద్ర్యము" అను పుస్తకాన్ని పుచ్చుకొని పేజీలు తిరుగవేస్తున్నాడు. ఒక్కొక్కసారి వీధిలో దిక్కుమొక్కులేని గర్భదరిద్రులు ఎండలో పడేపాట్లను గమనించిచూస్తున్నాడు. కానీ బేరంకోసం గంటలకొద్దీ కటకటలాడించే గృహిణుల పామరత్వానికి మనస్సులోనే క్రుంగిపోతూ, తాను వెళ్లి స్వయంగా "అమ్మా చేతిది అణాడబ్బులు పెట్టుకొని దానిమీద ఏమైనా ఒక సోలెడుగింజలు ధారకం దొరుకుతుందేమో అనేఆశతో ఎంతోదూరంనుండి మీగుమ్మాలకాడికివచ్చే కటికదరిద్రుల్ని ఇంత వేధించడం ఏంధర్మం ఏంన్యాయం అమ్మా" అని అడుగుదామన్నంత ఉద్వృతుడైపోతూ తిరిగి తమాయించుకుంటున్నాడు. అతనిదృష్టి పుస్తకంమీద ఉందో, లేక ప్రొద్దుటినుంచి ఆగాపులో అల్లాడే జనంమీద ఉందో మనం నిర్ణయించలేము.

ఒక్కొక్కసారి ప్రకృతిస్వభావాన్నిగురించి యోచించుకుంటూ "ఓ ఈశ్వరా! నీవు కరుణాస్వరూపుడవు. నీకరుణాదృష్టి ఈదీనులమీద ఎందుకు పడటంలేదు?

"ఇటువంటి అన్యాయ అంతరములను కొంతవరకైనా పోగొట్టడానికి నీపవిత్రమైన న్యాయశక్తిని నాకీయుము. పరమపవిత్రమైనటువంటిన్నీ మహా దుర్లభమైనటువంటిన్నీ మానవజన్మ ఎత్తికూడా ధర్మసాధనానికి సాధనభూతమైన తమ శరీరాన్ని పోషించుకొనే అవకాశంలేని ఈకటికదరిద్ర సోదరులకు, కొంచమైనా సహాయముచేయగలశక్తి, దీక్ష నాకిమ్ము" అని కంటివెంట నీరుకారుస్తూ ప్రార్థనా నిమగ్నుడైనాడు. ఇంతట్లో తనగుమ్మానికి కొంచంప్రక్క

గా దఖీలుచుని ఒకమనిషి పడిపోయినచప్పుడు, ఒక కుండ బద్దలైనచప్పుడూ రెండూ ఒకేసారి అతని చెవులో పడ్డాయి, చేతిలోపుస్తకం కిందపడేయడం. 'ఏమా!' అంటూ వీధిలోకి దౌడువెయ్యడం ఒకేసారి జరిగాయి. నిండా పాతికేళ్లుని దని ఒక కాపుకుఱ్ఱవాడు మొగంతిరిగి పడివున్నాడు. అమ్మకుందామని తెచ్చుకున్న మజ్జిగ పెరుగుకుండ బద్దలై ఆ పెంకులు అక్కడక్కడా చెదరిపడివున్నయి. ఈ చప్పుడువిని చుట్టుపట్లఉండే జనం కొంతమంది అక్కడికి పోగయ్యారు. ప్రేమానందుని చూద్దామనేఉద్దేశంతో వినయభూషణరావు అప్పుడే అక్కడికి రావడం తటస్థించింది. వినయభూషణరావుకి తనస్నేహితుని మనస్సు కుసుమకోమలమైందనిన్నీ సాటిజీవులకష్టాల్ని చూచి తాను ఆకష్టాల్ని అనుభవించినదానికంటె ఎక్కువ ఆవేదనపడే స్వభావంగలవాడనిన్నీ బాగా తెలుసు. ఏంచెయ్యడానికితోచక కన్నీరుకారుస్తూ పిడుగుపడిన మనిషిలాగ నిర్ఘాంతపడిచూస్తూఉన్న స్నేహితుడికి స్పర్శజ్ఞానం కలిగించేడు. స్నేహితుని చూడ్డంతోటే "వినయా! వచ్చావా? ఇక్కడ చూస్తుండు" అని అంటూ లోపలికెళ్లి ఒక పెద్ద చెంబుడుచన్నీళ్లు తెచ్చి కొన్ని మొగాన్నకొట్టి కొన్ని గొంతుకలోపోస్తూ విసనకఱ్ఱతో విసురుతూఉన్నాడు. ఐదునిమిషాలకల్లా ఆ కాపు కళ్లువిప్పిచూచి చేతులెత్తి దండంపెట్టాడు. కాని మాటాడడానికి శక్తిలేకపోయింది. లేవడానికి అంతకంటె శక్తిలేదు. ఆపడిపోవడంల్లో ప్రక్కనేవున్న ఒకరాయి పక్కలో గుచ్చుకుంది. ఉన్న నెత్తురుకాస్త బొటబొటా కారుతూఉంది. స్నేహితులిద్దరూకలిసి వాడిని తమహాల్లోకి తీసికెళ్లి ఒకప్రక్కమీద పడుకోబెట్టి ఇంత వేడివేడి కాఫీతెచ్చి నోట్లోపోసారు. డాక్టరు వినయభూషణుడు వెంటనే ఆగాయానికి అవసరమైనచికిత్సచేస్తూ,

"ప్రేమా! పోషణబాగుంటే ఈకుఱ్ఱవాడు చాలా బలంగాను, అందంగాను ఉండతగ్గవాడు. నీభావిభావపరిణామానికి శంఖుస్థాపనలాంటిదిగా ఉండగలదు. ఈనాటి ఈప్రదర్శనం."

"ఈశ్వరసంకల్పము నీసహాయము జతపడి మన వుద్దేశాలు భావంలోనే జీర్ణించిపోకుండా కార్యరూపంగా వచ్చినప్పుడు మనం అనుకోవచ్చు."

౨

"ఓసి...కూతురా, ఇంకారావేం, అంత పెళ్లినడకలునడుస్తూ పనిచేస్తూవుంటే ఎవడిచ్చివున్నాడు నీకూలివ్వడానికి. లేకుంటే నీఅబ్బెవడైనా మాదగ్గర ఆస్తి దాచిపెట్టాడనుకున్నావా? మధ్యాహ్నంనుంచి నీవిక కూలోకి రానక్కర్లేదు" అని కంట్రాక్టరు రుద్రయ్య ఒక ఆడకూలీని చెడతిడుతున్నాడు. పాపం ఆకూలిది గర్భంతోఉన్నమనిషి. అందులో ప్రతిరోజూ ఒకపూటకైనా కడుపునిండా గంజినీళ్లులేని పేదది. ఆలాగే ఆరాళ్లతట్టనీ నెత్తిమీదకి ఎత్తుకోలేక ఎత్తుకోలేక ఎత్తుకుంటూ "బాబూ మీరలా కోప్పడితే నేనేలాబతకను బాబూ పిల్లల్తో. ఓపలేని దాన్ని. మధ్యాహ్నం నాకెక్కడినుండి కూలో తిండి బాబూ. కూల్లేకుంటే ఇంట్లోపిల్లలు ఈగంజిబొట్టైనా లేక గిలగిలలాడుతూ మాడిపోతారు. తమలాంటి బాబులుకూ ఇంతదయనూడాలి?"

"ఆట్టేమాట్లాడకు. ఇప్పుడే గెంటేస్తా, నీపిల్లలు చస్తేనాకేం, నువ్వు నీమగడు చస్తేనాకేం, లోకం ఏమైనా చిన్నబోతుందా."

ఆకూలిమనిషికి ఆమాటలు విషపుముల్లుతో పొడిచినట్టైంది. ఎంతచెడినా హిందూస్త్రీలకు సుమంగలీత్వముకన్న ఎక్కువైంది లేదనునేసిద్ధాంతం ఉగ్గుపాల్తో వచ్చిందిగదా. కొంచం కోపంవచ్చినస్వరంతో,

"బాబూ ప్రపంచంలో అందరికీ అంతేనండీ. చచ్చేవరకే ఈభేదాలండీ. దేవుడికాడికి అందరం సమానులమేనండి."

ఆమాటలు వినేటప్పటికల్లా రుద్రయ్యకు ఎక్కడలేని రౌద్రంవచ్చింది. గుడ్లెఱ్ఱచేస్తూ,

"మాందరోచ్ఛత్ ! పో అవతలికి. హెచ్చుతక్కువ లేకుండా అలా వెళ్తావా ?"

అనిఅంటూ ఒంగోని నెత్తిమీద కెత్తుకోబోతూ ఉన్నతట్టను ఒక్కతోపుతోసాడు. దానితో ఆ మనిషి తట్టతోసహా పక్కకు ఒరిగింది. దెబ్బ తగల్లేదు గాని నడుంలో కలుక్కుమంది కాబోలు నడుం ఒక చేత్తో రాసుకుంటూ ఒకచేత్తో కంటివెంట కారేనీటిని పైటచెరుగుతో తుడుచుకుంటూఉంది. ఈప్రదర్శనం జరుగుతూఉంటేనే ప్రేమానందరావు తనస్నేహితుడితోకూడా ఏదో పనిమీద అలాగువెళ్తూ ఇదంతా చూచి అక్కడికివెళ్లాడు. కంట్రాక్టరు రుద్రయ్య అటువంటిసమయంలో వచ్చిన వీళ్లిద్దరిని చూచి గతుక్కుమని సమాళించుకుంటూ,

"ఏమండీ పంతులుగారూ ! ఇలాదయచేసారు." అని వంకరదండాలుపెట్టుకుంటూ వెంటబడ్డాడు.

ప్రేమానందుడు తిరిగైనాచూడకుండానే పక్కనొప్పితో బాధపడుతూఉన్న ఆ ఆడమనిషిదగ్గరికివెళ్లి "ఏమమ్మా ! మీ దేకులం ? ఇక్కడి కెంతదూరంలో ఉంది నీబస ? నీస్థితిగతులేమిటి?" అని దయతో ప్రశ్నించాడు.

ఆతనిప్రశ్నలోగల ఉదారం ఆతనిముఖంలోగల సానుభూతికనిపెట్టి "బాబూ! ఇక్కడికి రెండుకోసుల దూరంలోఉన్న రాంపల్లిఅగ్రహారం. మేం రాజులం. మా భూములు పుట్రలు అన్నికూడా అప్పులాళ్లపాలైనాయి. ఎంతకష్టపడిపండించినా కట్టుబళ్లు,మధ్యవర్తుల లంచాలు పోను మాకడుపుకు ఆవచ్చినపంట ఒక్కపూటకే చాలేదిగాదు. ఇక అప్పులుతీర్చుకునేదేమిటి. కుటుంబాలు పోషించుకునేదేమిటి. మాకుటుంబం చాలాకాలం అవిభక్తంగానే ఉండేది. అప్పట్లో ఉన్న పుస్తెపూసఅంతా అమ్మి మా పెద్దమామ కొడుక్కి చెన్నపట్నంలో ఏదో చదువుచెప్పించేసారు. అతడుమాత్రం మాకు సంబంధలేకుండానే ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్నాడు. అంతా పోయింతరవాత చెట్టుమీద పక్షుల్లాగ తలోదిక్కు ఇలా వచ్చాశాము. నాలుగునెలలైంది. నా పెనిమిటి ఎక్కడికో పిల్లల్ని నన్ను వదలేసి చెప్పకుండా లేచిపోయినాడు." అని కన్నీరువిడిచింది.

విచారస్వరంతో "పాపము అతనేమిచేస్తాడు. ఇంతకుటుంబాన్ని ఇంతదారిద్ర్యంలో భరించలేక ప్రాణంవిడవలేక తనఅవస్థనువిని తనకు దారీతెన్ను చూపించవలసిన బాధ్యతనువహించే నాథుల్లేక, తెగించి ఈపనిచేసాడు. ఈదేశంలో ఇటువంటి కుటుంబాలు కోటానుకోట్లుగా రోజురోజుకి పెరిగిపోతున్నాయి."

"నాకథ సాంతంగా వినండిబాబు. నాకు ఆరుగురు పిల్లలండీ. పెద్దవాడికి పదేళ్లుఉంటాయండి. నేను చీకటింటనే కోడికుయ్యకుండా లేచి ఇంత అంబలితాగి పిల్లలకోసం ఇక కుండెడుమూతెట్టి ఎండవేళకి ఇంత సంకటిచేసి, వాళ్లకింతవుంచి నాకింతపట్టుకుని పిల్లలు లేవకమునుపే బయుల్దేరుతే ఇక్కడికి ఏడుగంటలకి చేరుకుంటాను బాబూ. తిరిగి సాయంత్రం ఆరుగంటలికి ఇక్కడ్నుంచి బయల్దేరితే అక్కడికి ఎనిమిదిగంటలకి చేరుతాను. అప్పుడే బజారు చేసుకోటం, పిల్లల్ని చూసుకోటం."

"అయితే ఇంటిదగ్గిర పిల్లలకి నీళ్లు బట్టలు ఇంకా తక్కినపనులు ఎప్పుడు చేసుకుంటావు ?"

"ఏరోజురాకుంటే ఆరోజుకే గంజిలేనప్పుడు ఇక నీళ్లేమిటి పాలేమిటి. ఆపెద్దవాడే తక్కిన చిన్నాళ్లని చూచినా కొట్టినా."

ఆమాటలువిన్న ప్రేమానందుడు స్నేహితునితో

"అయ్యో కుక్కలనక్కల జన్మలకంటె తక్కువై పోయిందికదా మానవజన్మ ఈదేశంలో" అని అను

కుంటూ జేబులోంచి రెండురూపాయలు తీసి చేతిలో పెట్టి, "అమ్మా! బండిచేయించుకొని మరీ ఇంటికెళ్లు. ఇదిగో ఈ ఎనిమిదణాలు తీసికో బండిఅద్దెకు" అని చెప్పిపోతుండగా అక్కడే కూలిచేస్తూఉన్న పదేళ్ల కుఱ్ఱవాడొకడు తనదృష్టిని ఆకర్షించాడు. వాడినిచూచి

"ఆడుకోని, పాడుకోని, చదువుకోని ఖులాసాగా ఉండవలసిన ఇంత చిన్నవయస్సులో తన కడుపునైనా పూర్తిగానింపలేని, ఈకూలిడబ్బులకు ఈఎండలో వానలో ఆవిధంగా కష్టపడి జీవింపవలసి వచ్చిందిగదా. ఇటువంటి పరిస్థితుల్లో పెరిగినవాళ్లే భవిష్యద్భారత పౌరులుగాఉండి దేశసౌభాగ్యాన్ని రక్షించవలసినవాళ్లు" అని అనుకుంటూ ఎండలో మాడిపోయిన మొగంతో గుంటలుకట్టినకళ్లతో పని చేస్తూఉన్న ఆఅబ్బాయిదగ్గిరగా వెళ్లి,

"అబ్బాయీ! మీ అమ్మ నాన్న ఎక్కడున్నారు?"

"మా నాయన నిరుటి వేసంగిలో ఇక్కడే పనిచేస్తూ వడదొట్టి సనిపోయినాడండీ. మాఅమ్మకు కాళ్లుసేతులు పట్లు, వగరుపు ఆయాసమండీ. కూర్చుంటే లెగలేదు. నాకు పదిసంవత్సరాలుంటాయండీ. మా కులం కాపుకులం."

"అయితే మీకెవరు గంజికాచిపోయడానికి దిక్కెవరు? గంజి ఎలాగొస్తుంది?"

"మాయమ్మ ఆలాగే నాలిగిళ్లకువెళ్లి బిచ్చమెత్తుకొ వత్తుందండి. నాచెల్లెలు ఎనిమిదేళ్లది గంజికాచిపోస్తుందండీ. అదే మా కాదరువండీ"

వినయునివైపుతిరిగి "వినయా! ఈ కుఱ్ఱవాడి కథ ఎంత దీనంగాఉందో విన్నావా? మానవజీవిత పరిణామానికి పునాదువంటిదైన ఈ బాల్యావస్థ ఈవిధంగా వికాసానికి అవకాశంలేకుండా ఎండి రాలిపోతున్నది. పరమేశ్వరుడు శాంతిసౌఖ్యాలని ఎప్పుడు ఇస్తాడో?"

## 3

"వినయా! మనం మొదలుపెట్టిన పని కొంతవరకు జయప్రదంగా జరుగుతూఉన్నట్టేసుమా. ఇన్నాళ్లు ఈవికలాంగులంతా ఏమూలుండేవాళ్లో, ఎన్నెన్ని కష్టాలుపడుతుఉండేవాళ్లో కదా పాపము. వాళ్లందరికి తగిన సదుపాయాలుచేస్తూ, ఆరోగ్యనియమాలను గూర్చి చెప్పుతున్నావుకదా? ఆదిక్కుమాలిన వాళ్లం దరిపూచీ నీవేసుమా."

"నీవు చూడకుండా, నీవు లేకుండానే చూచే దెంతమాత్రం. మొన్న మనంకొని రిజష్టరీచేయించిన భూమి చాలా సారవంతమైనదని దానిని సాగుబడి చేస్తూఉన్న రైతుబిడ్డలు చెబుతున్నారు."

ఇలాగు వీళ్లు మాటాడుతూఉంటే వీధిలోనుంచి కొంతమంది పేదజనంవచ్చి కాళ్లమీదబడి,

"బాబూ! ఇల్లువాకిళ్లు కాలిపోయి నూడసుట్టం మొక్కదైవంలేకుండాఉన్న దిక్కుమాలినవాళ్లమండీ. అందరికీ తమరు ఆశ్రయమించి రచ్చిత్తున్నారు. మేమందరం మీకాళ్లబడ్డాం. ఏంచెయ్యమంటే అది చేత్తాం. ముక్కెడుగంజికి ఆదరువుచూపిస్తే అదే పదివేలు మాకు."

"అయ్యో! మీకెవ్వరూ సహాయం రాలేదా?"

"ఏంసహాయం ఎక్కడిసహాయం బాబూ. తాగడానికే గుక్కెడు నీళ్లులేక సచ్చిపోతున్నాము. మా అయిదారువందల గడపకీ మాగ్రాంపొలిమేరలో ఉన్న నుయ్యి ఒక్కటే మాఅందరికీ నీటికాధారం. ఇక మేము సేసేదేటుందిబాబు. గుడిసెలన్ని అగ్గిదేవుడు మింగుస్తూఉంటే, గుడ్లప్పచెప్పసి మిటకరిస్తూ పిల్లల్తో పాపల్తో బయలుకొచ్చాం. మాగోల కాకిగోలండి."

"మీరందరూ ఇంతవరకూ ఏమేమిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు."

“ఇదని ఏంసెప్పంబాబూ. పోయినాళ్లు పట్నాలెంబడిపోయి ఒకపావల్డబ్బులు తెచ్చుకొని ఆరోజు కారోజు కాలచ్చేపం చేసుకోవడం. లేనివాళ్లు, కొండలెంటవెల్లి, ఏసింతకూరో, ఏకర్వేపాకో, ఏ ఆకుకూరో ఇంతకోసి పట్నాలెంబడివెల్లి అమ్ముకొని ఆవచ్చినదాంతో జీవిత్తున్నామండీ. ఆ ఆకులైనా రుసుంకట్టందే కోసుకోనియ్యరుబాబూ అక్కడున్న బాబులు.”

“మీరందరూ ఇక్కడుండవచ్చును. మీకందరికీ కొన్నికొన్ని పనులు నేర్పుతాం. ఆపనులుచేస్తూ మేం చెప్పినట్టుగా మాత్రం ఉండాలి. ఇప్పటిమట్టుకు నూలుతీయడం,బట్టలునేయడం,సులభమైనమార్గాలతో వ్యవసాయంచెయ్యడం, తోటలుపెంచడం, బియ్యం దంచడం, ఈమొదలైనవన్నీ ఇక్కడ మేము చేయిస్తూ ఉన్నపనులు. మీ అనవసరపు అలవాట్లన్నీ క్రమంగా వదలెయ్యాలి. త్రాగుడు, నిషావస్తువులు వేసుకోవడం పూర్తిగా వదలెయ్యాలి. ఆరోగ్యవిషయాల్లోకూడా, మేచెప్పిన సలహాలను మీ రనుసరించాలి. ఇటువంటి వన్నీ మీ మంచికోసరం నియమింపబడ్డ నియమాలని మీకందరికీ క్రమంగా వాటంతటవే బోధపడతాయి.”

“సిత్తంబాబూ! మమ్మల్ని కాపాడ్డానికి మీ రిన్నిచమలు పడుతూఉంటే తమరిమాటని కాదనడం ఉంటుందా. నిప్పులోదూకమన్నా దూకుతాం, బాబూ.”

ఒక ముసలివానివైపుచూస్తూ “ఏం లేలే! మాగ్రామంలో ఉండేవాడవు ఎందుకిక్కడికి ఈలాగు వచ్చావు? అక్కడ నీఇల్లు వాకిళ్లు ఏమిచేశావు”

“అంతా తెలిసిన ప్రభువులు తమరు. నన్నీలాగున అడిగితే నే నేంచెప్పను. తనువంటి బుడతలందరూ మాగ్రామాల్ని వదలివేసి ఈలాగువచ్చేస్తే మమ్మల్ని పోషించేనాధు లింకెవరు? ఆ వున్నవాళ్లైనా మా గుడ్డలు కట్టుకుని మా కాకూలి డబ్బులు ఇచ్చే బుడతలు కారు. ఇక మాకు కడుపుగడిచే దేలాగండి. ఉన్నఊరిని వదల్లేక ఇల్లువాకిళ్లు అమ్ముడుపోయేవరకు అప్పుసప్పులు చేసుకుంటూ, ఆలాగేఉన్నాము. ఇక ముందు దారిలేక పెళ్లాంబిడ్డల్తో గూడా తెగబడి ఒక ఏడాదిబట్టి ఈఊళ్లో కూల్చేసుకుంటూ, ఒచ్చినాడు ఇంతగంజితాగుతూ లేన్నాడు పడుకుంటూ రోజులు వెళ్లబుచ్చుకుంటున్నాం. వీళ్లందరూ ఇలావస్తూఉంటే నేనుగూడా వచ్చాను. వచ్చినందుకు తమరిదర్శనమే అయింది.”

“అయ్యో! చాలావిచారము. పల్లెటూళ్లు పట్నవాస సౌకర్యాలతో నిండనంతకాలము(అనగా మనిషి జీవితానికిఅవసరమైనంతమట్టుకు) ఈకష్టములు తప్పవు. కోర్టు పనులొచ్చినా, ఆసుపత్రిసౌకర్యాలు కావలసివచ్చినా, చివరకు సామాన్యవిద్య కావలసివచ్చినా పట్నాల్లోకివస్తేనేగాని వేరేలేదు. అంతకంతకూ చివరకు నీటికికూడా వాచిపోవలసినంత దురవస్థవచ్చినది పల్లెటూళ్లలో. అందువల్ల ఈ అల్లరులు పడలేక అందరూ పట్నాల్లోనే నివసించవలసిన అవసరం ఏర్పడ్డది. నన్ను నిందిస్తే ఏమిప్రయోజనం. ఒకసారి మాఇంటికి నీకొడుకును తీసికొనిరా.”

“ఏంరాను. లేమితో డొమ్ములాటలాగు ఇక్కడికి వచ్చినప్పట్నుండీ, సహవాసాలు వాడికి జాస్తిఅయినాయి. తల్లితండ్రులం అయిన మామీద మునుపు చూపించే గౌరవము లేదు సరిగదా, ఒక్కొక్కనాడు కొట్టడానికికూడా వస్తాడు. వాడు తెచ్చుకొన్న కూలి డబ్బులు, వాడితాగడానికి, వాడి సినీమాలకి, వాడి పేకాట్లకి ఖర్చుపెట్టేసుకుని మమ్మల్ని ఇంకా ఇమ్మని వేధిస్తున్నాడు. ఇంట్లోపెళ్లాం, మేము, బ్రతికున్నామోలేదోకూడా వాడి కక్కర్లేదు. బాబూ! నా దుఃఖం ఎవరితో చెప్పుకోను.”

“రామయ్యా ఇలా మారిపోతాడని కల్లోకూడా నేననుకోలేదుసుమా. నీకడ సారం కొడుకు ఏమైనా నేర్చుకుంటున్నాడా? వాడిపేరు పైడిగాదూ?”

"అవును బాబూ! వాడిపేరు పైడిగాడే. నేనేం చదువు చెప్పించగలను బాబూ జ్ఞానంవచ్చేటంత చదువుచెప్పించడానికైనా దగ్గరడబ్బులేదు. ఏదో కష్టపడి ఇంతచెప్పించినా వాడి కెందుకూపనికిరాదు. ఈకూలినాలిపనులూ చేయడు. గుమాస్తా గిరులాదొరకవు. నేను పెద్దవాణ్ణైనా చాలా ప్రపంచానుభవం పొందాను. మీరెంత చదువున్నవారైనా ఒక్కమాట నాది వినండి. మన బాగోగులు మన మంచిచెడ్డలు అన్నీవిచారించి తీర్పవలసిన బాధ్యతగల ప్రభువుల చిత్తం మారాలి. మారేటట్టుచేయాలి. ఒక్కసంగతి. దేశంయావత్తూ ఎన్నిగ్రామాలున్నాయో, ఎంతెంత భూమి ఏఏవిధంగా సాగుబడి అవుతున్నాదో, ఎంతెంతశిస్తు వసూలవుతున్నాదో, ఎంతెంతవసూలు కావలసియున్నదో, ఈ మొదలైన వైనాలన్నీ తెలుసుకుంటూఉన్న అధికారులు, ఏఏగ్రామాల్లో నీటి సదుపాయం పొలాలకు, మనుష్యులకు పశువులకు ఏమాత్రం సదుపాయంలో ఉందో, గ్రామస్థులకు వారిబిడ్డలకు విద్య ఏమాత్రం అందుబట్లో ఉందో, వారి నికరాదాయం, వారిఖర్చులు, వారిజీవితవిధానం ఏమాత్రం సరీనుగాఉందో ఈ మొదలైన వైనాలన్నీ కనుక్కోవలసిన బాధ్యత ఆ అధికారులదేకదా. ఇంతకూ విధివిధానం అంతే పేదవాళ్లనే చుట్టిచుట్టి కొడుతూఉన్నది."

"ఆకాటికి ఈవిచారం అంతా ఎందుకు. రేపట్నుండి నీవు నీపిల్లలుకూడా ఇక్కడికేవచ్చి పనిపాటలు చేస్తూబతకండి. మీరందరూ ఇక వెళ్లండి."

వినయభూషణుని చూచి "వినయా! వీళ్లందర్నీ చూచావా ఎంతదీనంగా కనబడుతున్నారో. ఈ కార్మికసమస్య పెద్దసమస్యగా నన్ను వేధిస్తున్నాది. రేపు తెరవబోయే అస్సెంబ్లీలో నే నొకతీర్మానం కార్మికసంఘం తరఫున ఉపాదించాలని అనుకుంటున్నాను. ఇప్పుడు సాధారణంగా కూలీలందరూ ప్రొద్దున్న ఏడుగంటలనుండి పన్నెండుగంటలవరకూ అనగా తొమ్మిదిగంటలకాలం పూర్తిగా పనిచేస్తున్నారు. ఇది చాల అన్యాయం. అక్రమం. వారి దేహారోగ్యానికి భంగంలేకుండా ఎంతసేపు చేయవచ్చునని వైద్యులు చెబుతారో అంతకాలమే ఆపనివాళ్ల వలన పనిని పుచ్చుకోవాలి. ఇంకో అన్యాయంకూడా యోచించాలి. పనిని పుచ్చుకునేవాళ్లు తమరికిష్టం లేకుంటే ఆపనివాళ్లని అప్పటికప్పుడు తప్పించిస్తున్నారు. ఆ కూలివాడికి ఆపూట కూలినష్టం అవుతూ ఉంది. కాబట్టి పని మొదలుపెట్టకమునుపే ఇన్నాళ్లు ఈపనిపట్టునని అంచనావేసుకోవాలి. ఇన్నాళ్లు నెల జీతం మాదిరిగానే వాళ్లకు జీతాలు ఇచ్చి పని పుచ్చుకొనితీరాలి. న్యాయంగా అందరూ అనుభవించే సెలవులు ఈకూలీలక్కూడా అనుభవంలో ఉండాలి. ఏమి మాటాడకుండా అలాచూస్తున్నావు. ఇటువంటి తీర్మానంఒకటి ఉండాలంటావా? లేదంటావా?"

"తప్పకుండా ఉండాలనే నాఉద్దేశం. పౌరుల బాగోగులకు బాధ్యతవహింపవలసిన ప్రభుత్వమువారు తమంతటతామే ఇటువంటి ఆక్టులను ప్యాసుచేసిఉండాలి. ఇప్పటికైనా ఇటువంటివాటికి సహాయోద్యోగాలు కనబరిస్తేనే ప్రజాశాంతి ఏర్పడుతుంది. అయినట్టు మరచిపోయినాము. సాయంకాలం అయిపోతున్నాది. కలెక్టరు డేవిడ్డుగారిని కలుసుకోవాలనుకున్నాంగదూ!"

(ఇంకావుంది.)